# “వెలుగు సంబంధులు”

# (5:8–13)

చాల చిన్న వయస్సునుండే, పిల్లలు ఈ పాట పాడుతూ ఉంటారు: “నా చిన్న వెలుగును నేను ప్రకాశింపనిస్తాను.” ఏదియెలాగున్నా; అది కేవలం పిల్లల పాటకంటె ఎక్కువైనది మాత్రమే కాదు, అది జీవితం యొక్క ఖచ్చితమైన దృక్పథాన్ని యిస్తుంది. వెలుగు, చీకట్ల మధ్య జీవితం నైతిక పోరాటమైయుంటుంది. క్రైస్తవులుగా, మనం పోరాటం మధ్యనున్నాం.

లోకంలో చీకటి, వెలుగు అనేవాటి మధ్య వ్యత్యాసానికి దేవుని వాక్యము మనకు పిలుపునిస్తుంది. ఎఫెసీ. 5లో, క్రైస్తవులు “వెలుగు సంబంధులై”యున్నట్టు గుర్తిస్తుంది:

> మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు. వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమను వాటిలో కనబడుచున్నది. గనుక ప్రభువుకేది ప్రీతికరమైనదో దానిని పరీక్షించుచు, వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి. నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక వాటిని ఖండించుడి. ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులనుగూర్చి మాటలాడుటయైనను అవమానకరమై యున్నది. సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్షపరచబడును; ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగేగదా (5:8–13).

ఎనిమిదవ వచనం ఏమంటుందో తిరిగి గమనించు: “మీరు పూర్వమందు చీకటియై యుంటిరి, ఇప్పుడైతే ప్రభువునందు వెలుగైయున్నారు. … వెలుగు సంబంధులవలె నడుచుకొనుడి.” మన గత జీవితాలు ఎలాగున్నాయో ప్రస్తావించడంలో ఉపయోగమున్నట్టు పౌలు చూచాడు. క్రీస్తునందు లేని దినాల్లో మన స్థితి ఎట్టిదైయుందో మరచిపోవడం పౌలుకు యిష్టంలేదు. “చీకటి” అనే ఒకే పదంతో మన గత జీవితమంతటిని పౌలు సంగ్రహం చేశాడు. మనం చీకటిలో నడుచుకొనడం మాత్రమేగాక, మనం చీకటియై ఉన్నాము కూడా. ఈ చీకటిని దేవుని వాక్యం వర్ణిస్తుంది.

## చీకటిలో జీవించుట

తప్పు చేయడంలో చీకటి సంతోషిస్తుంది, దుష్టత్వం కలిగించే వక్ర మార్గమునందు అది ఉల్లసిస్తుంది (సామెతలు 2:14). చీకటి దుష్టుల మార్గమైయుంటుంది (సామెతలు 4:19). అది దేవుని ఆజ్ఞలను మార్చివేసి (త్రిప్పివేసి) “మేలును” కీడని, “కీడును” మేలని అంటుంది (యెషయా 5:20). చీకటి జనులను బంధిస్తుంది (యెషయా 42:7).

చీకటి దేహమంతా వ్యాపించే శక్తి గలదైయున్నట్టు మనం చెప్పబడ్డాం (మత్తయి 6:23). తీర్పునందు పాపులు వెలుపట చీకటిలోనికి త్రోసివేయబడుదురని బైబిలు అంటుంది (మత్తయి 8:12). వెలుగుకంటె చీకటిని ఎక్కువగా ప్రేమించేవారు క్రీస్తు ప్రభువును కూడా నిరాకరిస్తారని బైబిలు స్పష్టపరచింది (యోహాను 3:19). చీకటిలోని ప్రజలు అపవాది యొక్క అధికారం క్రిందికి వస్తారని కూడా అది అంటుంది (అపొ. 26:18). వాస్తవంగా, చీకటి తనంతట తానే శక్తియై ఉంది. మనం మన సొంత ప్రయత్నాలతో దానిలోనుండి తప్పించుకోలేం (కొలస్సీ. 1:12, 13). చీకటి జనులకు గుడ్డితనం కలిగిస్తుంది (1 యోహాను 2:11). తరువాత ఎఫెసీ పత్రికలో మనం యిలా చదువుతాం: “ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకారసంబంధులగు లోక నాధులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము” (6:12).

బైబిల్లో రమారమి వంద లేఖన భాగాల్లో నైతిక చీకటి యొక్క చెడుగును, నష్టము లేక చెరుపును గూర్చి చదువుతాం. నిజంగా లోకపు చీకటి యొక్క అంధకారం ఎంతయై ఉందో క్రైస్తవులు గ్రహించియుండరని నేననుకొంటున్నాను. దాన్నిగూర్చి మనం ఆలోచింపం. వెలుగు సంబంధులుగా ఉండడం మనం ఆనందించ కోరతాం, కాని అంధకారం యొక్క అపాయాన్ని మనం మరువకూడదు.

వార్తల్లో మనం చదివే ప్రతి నేరం వెనుక అంధకారం ఉంది. పాపం ఎప్పుడు జరిగినా, ఆ ప్రతి కార్యానికి వెనుక అంధకారం శక్తియై ఉంది. అంధకారం వివాహాలను నాశనం చేస్తుంది. (డ్రగ్‌కు) త్రాగుడుకు అలవాటుపడేవారిని అది ఉత్పత్తి చేస్తుంది; ద్వేషానికి అది జన్మనిస్తుంది. దురాశ పెంపొందడానికి అది నేలగా పని చేస్తుంది, అది దూషణను బలత్కారాన్ని రేపుతుంది. అంధకారం అసూయను ప్రోత్సహిస్తుంది, కలహాన్ని రేపుతుంది, స్వార్థం పెంపొందేలా అది చేస్తుంది. ఆలోచింపని కార్యాలకు అది మానవులను నడిపిస్తుంది. దీన్ని బైబిలు తేటపరచుతోంది:

> మరియు వారు దేవుని నెరిగియు ఆయనను దేవునిగా మహిమపరచలేదు, కృతజ్ఞతా స్తుతులు చెల్లింపనులేదు గాని తమ వాదములయందు వ్యర్థులైరి. వారి అవివేక హృదయము అంధకారమయమాయెను; …
>
> మరియు వారు తమ మనస్సులో దేవునికి చోటియ్యనొల్లకపోయిరి గనుక చేయరాని కార్యములు చేయుటకు దేవుడు భ్రష్ట మనస్సుకు వారినప్పగించెను. అట్టివారు సమస్తమైన దుర్నీతిచేతను, దుష్టత్వముచేతను, లోభముచేతను, ఈర్ష్యచేతను నిండుకొని, మత్సరము నరహత్య కలహము కపటము వైరమనువాటితో నిండినవారై కొండెగాండ్రును అపవాదకులును, దేవద్వేషులును, హింసకులును, అహంకారులును, బింకములాడు వారును, చెడ్డవాటిని కల్పించువారును, తలిదండ్రుల కవిధేయులును, అవివేకులును మాట తప్పువారును అనురాగ రహితులును, నిర్దయులునైరి (రోమా 1:21, 22ఎ, 28–31).

క్రీస్తులోనికి మనం రాకముందు, మనం కేవలం చీకటిలో ఉన్నవారం మాత్రమే కాదు, మనం చీకటి అయ్యే ఉన్నాం.

## వెలుగులో నడచుట

మనం ఒకప్పుడు చీకటియై ఉన్నా, యిప్పుడు ప్రభువునందు వెలుగైయున్నాం (5:8). "వెలుగు సంబంధులుగా (వెలుగు పిల్లలుగా) నడుచుకోవాలని" పౌలు క్రైస్తవులకు పిలుపునిస్తున్నాడు. వెలుగును గూర్చి దేవుని వాక్యం ఏమి చెప్తుతుందో గమనించు.

1. **వెలుగు మంచి ఫలాన్ని ఫలిస్తుంది.** "వెలుగు ఫలము సమస్తవిధములైన మంచితనము, నీతి, సత్యమును వాటిలో కనబడుచున్నది" (5:9). "మంచితనము" (గ్రీకు.: *agathosune*) అనేది నైతిక శ్రేష్ఠతకు సంబంధించినదైయుంటుంది. సత్యం ఎరిగిన దానిని మించి, దానిని జీవించుతాం. వెలుగు ఫలాన్ని పుట్టిస్తుంది. అది యితరులకు మేలు కలిగేలా త్యాగపూరితంగాను, యిష్టపూర్వకంగాను చేసే పరిచర్యలో అది పూర్ణంగా వ్యక్తపరచుకుంటుంది. "నీతి" (గ్రీకు.: *dikaiosune*) "మనుష్యులకును దేవునికి వారి ఋణాలను తీర్చేది."[1] దేవునియెడలను, మనుష్యులయెడలను ఎలా నడుచుకోవాలో అలా నడుచుకొనడం అని అర్థం. "సత్యము" (గ్రీకు.: *aletheia*) అనేది మనం ఎరిగినదానికి సంబంధించింది కాదు, మనం చేసేదానికి సంబంధించింది. వెలుగు సత్యమును ఎరుగుటకు మాత్రమే గాక జీవించుటకు మనలను బలపరచును.

2. **ప్రభువునకు ఏది ప్రీతికరమో దాన్ని వెలుగు కనుగొంటుంది** (5:10). "నేర్చుకొన జూచు" అనే (గ్రీకు.: *dokimazo*) "కనుగొను" అని కూడా తర్జుమా చేయవచ్చు. ప్రాచీన తూర్పు మార్కెట్టు స్థలాలనుండి ఆ పదం వచ్చింది. క్రిక్కిరిసియున్న ఆ బజారులలో షాపుకు కిటికీలుండడం అరుదుగా ఉండేది. అది చీకటిగా ఉంటుంది. వస్తువులు కనబడడం కష్టం. గనుక కొన్న వస్తువును షాపులో పరిశీలనగా చూచుకొనడం దాదాపు అసాధ్యంగా ఉండేది. మట్టి కుండగాని, బట్టగాని, లేక ప్రజలు కొనుక్కునే వస్తువు ఏదైనా, వారు వెలుపలికి వెళ్లి వెలుగులో పెట్టి చూచుకుంటారు. దానిలో ఏదైనా పగులుగాని, లేక మరకలుగాని యింకా ఏ విధమైన లోపంగాని – చీకటి కొట్టులో చూడలేనిదాన్ని వెలుగులో చూడ వీలుంటుంది.

క్రీస్తు ప్రభువు ప్రక్కనే ఉంటే మనం ఈ పని చేయగలం. మన ఉద్దేశాలు, చర్యలు, మాటలు నిజంగా ఏమైయున్నాయో చూచుకొనడానికి ఆయన వెలుగు మనకు సహాయం చేస్తుంది. ప్రభువును ఆనందింపజేసేది మనయందు ఏది ఉందో దాన్ని చూచేలా ఆయన వెలుగు మనకు సహాయపడుతుంది. అంతేకాదు, ఏ నైతిక దోషాలు, పాపాలు మనయందు ఉండి, మన జీవితాల్లోనుండి తొలిగింపబడాలో వాటిని కూడా ఆయన వెలుగు మనకు చూపుతుంది.

3. **వెలుగు చెడుగును బయలుపరచుతుంది.** "నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలివారైయుండక వాటిని ఖండించుడి. ఏలయనగా అట్టి క్రియలు చేయువారు రహస్యమందు జరిగించు పనులను గూర్చి మాటలాడుటయైనను అవమానకరమై యున్నది. సమస్తమును ఖండింపబడి వెలుగుచేత ప్రత్యక్షపరచబడును; ప్రత్యక్షపరచునది ఏదో అది వెలుగేగదా" (5:11–13). చెడుగును బయలుపరచడానికి సత్యము దానిపై ప్రకాశింపనీయాలి.

గత వేసవిలో మా కుటుంబం సెంట్రల్ టెక్సాస్ వెళ్లింది. ఆ టూర్‌లో ఒక స్థలమందు గైడ్ లైట్లు ఆర్పివేశాడు. సంపూర్ణంగా చీకటిని అనుభవించే అనుభవాన్ని అతడు మాకు కలిగించాడు. అది మమ్మును ఆవరించి మమ్మును ముంచివేసినట్టుంది. ఆ చీకటిలో నేను ఏమే చూడలేకపోయాను. తిరిగి గైడ్ స్విచ్ ఆన్ చేసినప్పుడు, చీకటి అప్పటికప్పుడే మాయమైపోయింది. వెలుగు చీకటిని జయిస్తుంది. సెంట్రల్ టెక్సాస్‌లోని గుహలో అది నిజమే, ఆత్మ సంబంధమైన మన జీవితాలలో కూడా అది నిజమే. ప్రభువైన యేసు యొక్క వెలుగు చీకటిపై విజయమొందుతుంది.

క్రీస్తుకు చెంది దేవుని బిడ్డయైయున్న ప్రతి వ్యక్తియు యేసుక్రీస్తు యొక్క సువార్తవలన వెలిగింపబడినవాడై, చీకటిపై వెలుగు జయమొందుననే సత్యానికి సజీవమైన సాక్షియై ఉన్నాడు. ఒకప్పుడు మనం చీకటియై ఉంటిమి అయితే ప్రభువునందు వెలుగైయున్నాం. మన జీవితాల్లో తన వెలుగు ప్రకాశించునట్లు ఆయన తగినంత లక్ష్యము చూపువాడై యున్నాడు – చీకటిని ఛేదించుకుంటూ పోయి మనకు వెలుగునిస్తాడు.

## ముగింపు

వెలుగు సంబంధులు (పిల్లలు)గా జీవించుదుము. ఈ వారం స్కూలుకు వెళ్లు, ఆ స్థలంలో నీవు వెలుగువని గుర్తుంచుకో. ఈ వారం నీవు పనికి వెళ్లు – నీ చుట్టునున్న ప్రజలకు నీవు వెలుగుగా ఉండు. నీ యింటనున్నవారికి వెలుగుగా ఉండు. వారు నిన్ను చూచునప్పుడు, ప్రభువైన యేసును చూడనిమ్ము.

నీవు క్రైస్తవుడవు కానట్టయితే, నీ చీకటి బ్రతుకునుండి ప్రభువైన క్రీస్తువైపు తిరుగు. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందు. చీకటినుండి వెలుగులోనికి దాటిపొమ్ము.

---

సూచన

[1]William Barclay, *The Letters to the Galatians and Ephesians*, The Daily Study Bible Series, rev. ed. (Philadelphia: Westminster Press, 1976), 164.